24-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 03-04-97 మధువనం

"పాత సంస్కారాలను సమాప్తము చేసి తమ నిజ సంస్కారాలను ధారణ చేసి ఎవర్రెడీగా అవ్వండి"

ఈ రోజు బాప్ దాదా తమ నలువైపుల ఉన్న విశ్వపిత యొక్క ప్రేమలో లవలీనులైన మరియు అదృష్టవంతులైన పిల్లలను చూస్తున్నారు. పిల్లలు ప్రతి ఒక్కరి భాగ్యాన్ని చూసి బాబాకు కూడా ఏమని గర్వంగా ఉంటుందంటే - వర్తమాన సమయములో నా పిల్లలు ఎంతటి గొప్పవారంటే మొత్తము కల్పములో, దేవతా స్వరూపములోగానీ, ధర్మనేతల రూపంలోగానీ, మహాత్ముల రూపంలోగానీ, పదమపతి ఆత్మల రూపంలోగానీ బ్రాహ్మణులైన మీకు ఎంతటి భాగ్యము ఉందో, అంతటి భాగ్యము ఇంకెవ్వరికీ లేదు. మరి ఇటువంటి మీ శ్రేష్ఠ భాగ్యాన్ని సదా స్మృతిలో ఉంచుకుంటున్నారా? వాహ్ భాగ్యవిధాత బాబా మరియు వాహ్ శ్రేష్ఠ ఆత్మనైన నా భాగ్యము అని ఈ ప్రణవనాద గీతాన్ని మనసులో సదా పాడుకుంటూ ఉంటారా! భాగ్యానికి చెందిన ఈ పాట సదా స్వతహాగానే మ్రోగుతూ ఉంటుందా? బాబా పిల్లలను చూస్తూ-చూస్తూ సదా హర్షితులవుతారు. పిల్లలు కూడా హర్షితులవుతారు కానీ అప్పుడప్పుడు మధ్యమధ్యలో తమ భాగ్యాన్ని ఇమర్జ్ చేసేందుకు బదులుగా మర్జ్ చేసేస్తారు. పిల్లలలో తమ సౌభాగ్యపు నషా, నిశ్చయము మర్జ్ అయిపోవటాన్ని చూసినప్పుడు బాబా ఏమంటారు? డ్రామా. కానీ బాప్ దాదా పిల్లలందరినీ సదా భాగ్యం యొక్క స్మృతి స్వరూపులుగా చూడాలనుకుంటారు. మీరందరూ కూడా ఇదే కోరుకుంటారు కానీ మధ్యలో 'కానీ...' అనేది వస్తుంది. ఎవరిని అడిగినా సరే, పిల్లలందరూ - నేను బాబా సమానంగా అవ్వాల్సిందే అన్న లక్ష్యాన్నే పెట్టుకుని నడుచుకుంటున్నాను అని అంటారు. లక్ష్యము చాలా బాగుంది. లక్ష్యము శ్రేష్ఠమైనది అన్నప్పుడు, చాలా మంచిది అన్నప్పుడు మరి ఒక్కోసారి ఇమర్జ్ రూపంలో, ఒక్కోసారి మర్జ్ రూపంలో ఎందుకుంటుంది? కారణమేమిటి? బాప్ దాదాతో ఎంతో మంచి-మంచి ప్రతిజ్ఞలు కూడా చేస్తారు, ఆత్మిక సంభాషణ కూడా చేస్తారు, అయినా మళ్ళీ లక్ష్యము మరియు లక్షణాలలో తేడా ఎందుకుంటుంది? బాప్ దాదా రిజల్టులో కారణమేంటి అన్నదానిని చూసారు. వాస్తవానికి అదేమిటి అనేది మీ అందరికీ తెలుసు, అది కొత్త విషయమేమీ కాదు, అయినా కూడా బాప్ దాదా రివైజ్ చేయిస్తారు.

బాప్ దాదా చూసారు, మూడు విషయాలు ఉన్నాయి - ఒకటేమో ఆలోచించటము, సంకల్పము చెయ్యటము. రెండవది మాట్లాడటము, వర్ణన చెయ్యటము మరియు మూడవది కర్మలలో ప్రాక్టికల్ అనుభవములోకి మరియు నడవడికలోకి తీసుకురావటము, కర్మలలోకి తీసుకురావటము. మూడింటిలో సమాన బ్యాలెన్స్ తక్కువగా ఉంది. బ్యాలెన్స్ ఉన్నప్పుడు నిశ్చయము మరియు నషా కనిపిస్తాయి మరియు బ్యాలెన్స్ తక్కువగా ఉంటే నిశ్చయము మరియు నషా మర్జ్ అయిపోతాయి. రిజల్టులో ఏమి చూడటం జరిగిందంటే - ఆలోచించే విధానము చాలా మంచిగా కూడా ఉంది మరియు వేగంగా కూడా ఉంది. మాటలలో వేగం మరియు నషా, అవి కూడా 75 శాతం కరెక్టుగానే ఉన్నాయి. మాట్లాడటంలో మెజారిటీ తెలివైనవారిగానే ఉన్నారు కానీ ప్రాక్టికల్ నడవడికలోకి తీసుకురావటంలో టోటల్ మార్కులు తక్కువగా ఉన్నాయి. కావున రెండు విషయాలలో బాగానే ఉన్నారు కానీ మూడవ విషయంలో చాలా తక్కువగా ఉన్నారు. కారణమేమిటి? సంకల్పాలు కూడా బాగున్నాయి మరియు మాటలు కూడా చాలా సుందర రూపంలో ఉన్నాయి అన్నప్పుడు మరి ప్రాక్టికల్ లో ఎందుకు తక్కువైపోతుంది? కారణమేమిటో తెలుసా?తెలుసా, తెలియదా చెప్పండి. మీకు చాలా బాగా తెలుసు. ఒకవేళ ఎవరికైనా - ఈ టాపిక్ పై భాషణ చెయ్యండి లేక క్లాస్ చెయ్యండి అని చెప్తే ఎంత బాగా క్లాస్ చేయిస్తారు! మరియు చాలా నిశ్చయము, నషా, ఆత్మిక గర్వంతో భాషణ కూడా చేస్తారు, క్లాస్ కూడా చేయిస్తారు. చేయిస్తారు. ఏమేమి చెప్తున్నారు అని బాప్ దాదా అందరి క్లాసులు వింటారు. వాహ్! వాహ్ పిల్లలూ వాహ్! అనుకుని నవ్వుకుంటూ ఉంటారు.

ముఖ్యమైన విషయము - బాప్ దాదా ఇంతకుముందు కూడా వినిపించారు, ఇప్పుడు రివైజ్ కోర్స్ నడుస్తూ ఉంది. బాబా ఏమంటున్నారంటే - కారణం ఒక్కటే ఉంది, ఎక్కువేమీ లేవు, ఒకటే కారణము ఉంది మరియు ఆ కారణాన్ని నివారణ చేయటము కూడా కష్టమేమీ కాదు, చాలా సహజము అని బాప్ దాదా భావిస్తారు. కానీ సహజమైనదానిని కూడా కష్టంగా చేసుకుంటారు. అది కష్టమేమీ కాదు, కానీ అలా చేసుకుంటారు, ఎందుకని? నషా మర్జ్ అయిపోతుంది. ఒకటే కారణము ఉంది, ధారణకు సంబంధించిన విషయాలేవైతే వింటారో, చేస్తారో, శక్తుల రూపంలో కావచ్చు, గుణాల రూపంలో కావచ్చు, ధారణకు సంబంధించి చాలా మంచి-మంచి విషయాలను చెప్తారు, ఎంత బాగా చెప్తారంటే - వాటిని

వినేవారు, వారు అజ్ఞానులు కావచ్చు, జ్ఞానులు కావచ్చు, వాటిని విని చాలా బాగుంది-చాలా బాగుంది అని అంటూ బాగా చప్పట్లు కొడతారు, చాలా బాగుంది అని అంటారు. కానీ, ఎన్ని సార్లు 'కానీ' అనేది వచ్చింది? ఈ 'కానీ' అన్నదే విఘ్నం కలిగిస్తుంది. 'కానీ' అన్న పదము సమాప్తమైపోవటము అనగా బాబా సమానంగా సమీపంగా రావటము మరియు బాబాకు సమీపంగా రావటము అనగా సమయాన్ని సమీపంగా తీసుకురావటము. కానీ ఇప్పటివరకు 'కానీ' అన్న పదాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. ఇది బాబాకు మంచిగా అనిపించదు కానీ చెప్పాల్సి వస్తుంది. దీనికి కారణమేమిటి? ఏదైతే చెప్తున్నారో, ధారణ కూడా చేస్తున్నారో, అది ధారణ రూపంలో ధారణ చేస్తున్నారు మరియు ఆ ధారణ అనేది, కొందరికి కొద్ది సమయము నడుస్తుంది, కొందరికి ఎక్కువ సమయం కూడా నడుస్తుంది కానీ ఆ ధారణ అనేది ప్రాక్టికల్ గా సదా పెరుగుతూ ఉండాలంటే దాని కొరకు ముఖ్యమైన విషయము ఇదే - ద్వాపరము నుండి మొదలుకొని అంతిమ జన్మ వరకు ఏవేవైతే అవగుణాలు లేక బలహీనతలు ఉన్నాయో, అవి సంస్కారాల రూపంలో ధారణ అయిపోయాయి మరియు సంస్కారాలుగా అయిన కారణంగా శ్రమించాల్సిన అవసరము ఉండదు. వదలాలని కూడా అనుకుంటారు, మంచిగా అనిపించదు కూడా, అయినా ఏం చెయ్యను, నా సంస్కారము అలా ఉంది అని అంటారు. మీరు తప్పుగా అనుకోవద్దు, నా సంస్కారమే అలా ఉంది అని అంటారు. కానీ సంస్కారము తయారైంది ఎలా? తయారుచేసుకున్నారు కాబట్టే తయారైంది కదా! కనుక ద్వాపరము నుండి ఈ తప్పుడు సంస్కారాలు ఏవైతే తయారయ్యాయో, వీటి వలన మీరు ఆ సమయానికి వద్దనుకున్నా వాటికి వశమవుతారు, కానీ మళ్ళీ - ఏం చెయ్యాలి, నా సంస్కారము అని అంటారు. అంటే సంస్కారాలు అనేవి సహజంగానే వద్దనుకున్నా కూడా ప్రాక్టికల్ లోకి వచ్చేస్తాయి కదా! ఎవరికైనా క్రోధం వస్తే, వారు కాసేపటి తర్వాత - మీరు తప్పుగా అనుకోవద్దు, ఇది నా సంస్కారము అని అంటారు. క్రోధాన్ని సంస్కారంగా చేసుకున్నారు, అవగుణాన్ని సంస్కారంగా చేసుకున్నారు, మరి గుణాలను సంస్కారంగా ఎందుకు చేసుకోలేదు? క్రోధము అనేది అజ్ఞానపు శక్తి మరియు జ్ఞానము యొక్క శక్తి శాంతి, సహన శక్తి. మరి అజ్ఞానము యొక్క శక్తి అయిన క్రోధాన్ని చాలా బాగా సంస్కారంగా చేసుకున్నారు మరియు దానిని ఉపయోగిస్తూ కూడా ఉంటారు, మళ్ళీ క్షమాపణలు కూడా అడుగుతూ ఉంటారు. క్షమించండి, ఇకపై ఇలా జరగదు అని అంటారు. కానీ ముందు ఇంకా ఎక్కువగా జరుగుతుంది. కారణమేమిటి? ఎందుకంటే సంస్కారంగా చేసుకున్నారు. కనుక బాప్‌దాదా ఒకటే విషయాన్ని పిల్లలకు పదే-పదే వినిపిస్తున్నారు, అదేమిటంటే - ఇప్పుడు ప్రతి గుణాన్ని, ప్రతి జ్ఞానపు విషయాన్ని సంస్కార రూపములో తయారుచేసుకోండి.

బ్రాహ్మణ ఆత్మల నిజ సంస్కారము ఏది? క్రోధమా లేక సహనశక్తా? ఏది? సహనశక్తి, శాంతి శక్తి... ఇవే కదా! మరి అవగుణాలనైతే సహజముగానే సంస్కారాలుగా చేసుకున్నారు, వాటిని బాగా లోతుగా లోపల నింపేసుకున్నారు, కనుక అవి వద్దనుకుంటున్నా బయటకు వస్తూ ఉంటాయి. అలా ప్రతి గుణాన్ని బాగా లోతుగా సంస్కారంగా చేసుకోండి. నా నిజ సంస్కారము ఏది? ఇది సదా గుర్తుంచుకోండి. అక్కడ రావణుని ఆస్తిని సంస్కారంగా చేసుకున్నారు. పరాయి వస్తువును మీదిగా చేసుకున్నారు. ఇప్పుడు బాబా ఖజానాను మీదిగా చేసుకోండి. రావణుని వస్తువును చాలా జాగ్రత్త చేసి పెట్టుకున్నారు కానీ బాబా వస్తువును మాయం చేసేస్తారు, ఎందుకిలా? రావణునిపై ప్రేమ ఉందా! రావణుడు మంచిగా అనిపిస్తాడా లేక బాబా మంచిగా అనిపిస్తారా? అనటానికైతే అందరూ బాబా మంచిగా అనిపిస్తారు అని అంటారు, మనసుతో ఇలానే అంటున్నారు కదా? కానీ ఎవరైతే మంచిగా అనిపిస్తారో, వారి మాట నిశ్చయమనే ఇంకుతో మనసులో ఇమిడిపోతుంది. ఎవరైనా రావణుని సంస్కారానికి వశమైనా కూడా - బాబా, మీరంటే నాకు చాలా ప్రేమ, చాలా ప్రేమ అని అంటూ ఉంటే, బాబా అడుగుతారు - ఎంత ప్రేమ ఉంది? ఆకాశం కంటే కూడా ఎక్కువ ప్రేమ ఉంది అని అంటారు. బాబా అది విని - వీరు ఎంత అమాయకపు పిల్లలు అని సంతోషిస్తారు కూడా. అయినా కూడా బాబా అంటారు, బాబా పిల్లలందరికీ మాట ఇచ్చారు - ఒకవేళ మనస్ఫూర్తిగా ఒక్కసారైనా కూడా ''నా బాబా'' అని అన్నారంటే, ఆ తర్వాత మళ్ళీ మధ్యమధ్యలో మర్చిపోయినా సరే, ఒక్కసారైనా మనస్ఫూర్తిగా ''నా బాబా'' అని అన్నారంటే బాబా కూడా - మీరు ఎవరైనా సరే, ఎలా ఉన్నా సరే, మీరు నా వారే అని అంటారు. నాతో పాటు అయితే తీసుకునే వెళ్ళాలి. కేవలం బాబా కోరుకునేది ఏమిటంటే - ఊరేగింపులో ఒకరిగా రావద్దు, ప్రేయసిగా అయ్యి రండి. ఇది విని అందరూ చాలా సంతోషిస్తున్నారు. మీపై మీకు నవ్వు కూడా వస్తుంది.

ఇప్పుడు వింటున్నప్పుడు మీపై మీరు నవ్వుకుంటారు కదా! మీపై మీకే నవ్వు వస్తుంది కానీ ఆవేశంలోకి వచ్చినప్పుడు ముఖం ఎర్రగా అయిపోతుంది, పాలిపోతుంది. కానీ బాబా రిజల్టులో చూసారు, పిల్లలలో ఒక విశేషత చాలా బాగుంది, అది ఏమిటి? పవిత్రతలో ఉండటము, దీని కొరకు ఎంతగా సహించాల్సి వచ్చినా, వ్యతిరేకించేవారు ఎంత ఎదుర్కొన్నా కానీ ఈ విషయంలో 75 శాతం మంచిగా ఉన్నారు. కొంతమంది గొప్పలు చెప్పుకున్నా కానీ 75 శాతం

మంది ఈ విషయంలో పాస్ అయ్యి చూపించారు. ఇప్పుడు దీని తర్వాత రెండవ సబ్జెక్టు ఏది వస్తుంది? క్రోధము. దేహభానమైతే మొత్తానికి సంబంధించినది. కానీ ఏం గమనించటం జరిగిందంటే, క్రోధమనే సబ్జెక్టులో చాలా తక్కువమంది పాస్ అయ్యారు. బహుశా క్రోధమనేది వికారమేమీ కాదు, అది ఒక శస్త్రము, వికారము కాదు అని భావిస్తుండవచ్చు. కానీ క్రోధము జ్ఞాన స్వరూప ఆత్మలకు మహాశత్రువు ఎందుకంటే క్రోధము అనేక ఆత్మల సంబంధ-సంపర్కములోకి రావటం ద్వారా ప్రసిద్ధమైపోతుంది మరియు క్రోధాన్ని చూసి బాబా పేరుకు చాలా నింద జరుగుతుంది. చూసాములే జ్ఞాన స్వరూప పిల్లలను అని అంటారు. క్రోధానికి చాలా రూపాలు ఉన్నాయి. ఒకటేమో, మహారూపము, దాని గురించి మీకు బాగా తెలుసు - ఫలానావారు క్రోధం చేస్తున్నారు అని అది కనిపిస్తుంది. రెండవది - క్రోధము యొక్క సూక్ష్మ స్వరూపముగా లోపల ఈర్ష్య, ద్వేషము, అయిష్టము ఉంటాయి. ఈ స్వరూపంలో గట్టిగా మాట్లాడటము ఉండదు, బయటకు ఏమీ కనిపించదు, కానీ ఏ విధంగా బయటకు క్రోధం ఉన్నప్పుడు ఆ క్రోధము అగ్ని రూపము కదా, అది లోపల స్వయాన్ని కూడా దహించి వేస్తూ ఉంటుంది మరియు ఇతరులను కూడా దహించి వేస్తుంది. అలాగే ఈర్ష్య, ద్వేషము, అయిష్టము లాంటివి ఎవరిలో అయితే ఉంటాయో, వారు ఈ అగ్నిలో లోలోపలే కాలిపోతూ ఉంటారు. బయటకు ముఖం ఎర్రగా, పాలిపోయినట్లు అవ్వదు, అలా ఎర్రగా, పాలిపోయినట్లు అవ్వటము కొంచెం నయమే, కానీ వీరు నల్లగా అయిపోతారు. మూడవది, క్రోధానికి చతురతతో కూడిన రూపం కూడా ఉంది, అది ఏమిటి? ఎలా మాట్లాడుతూ ఉంటారు మరియు ఎలా భావిస్తూ ఉంటారంటే - అక్కడక్కడ సీరియస్ అవ్వాల్సే ఉంటుంది, అక్కడక్కడ కళ్యాణం కోసం లా ను (చట్టాన్ని) చేతిలోకి తీసుకోవాల్సే వస్తుంది. ఇప్పుడిందులో కళ్యాణముందా, లేదా అన్నది మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. బాప్ దాదా ఎవ్వరికీ 'లా' ను (చట్టాన్ని) తమ చేతిలోకి తీసుకునే అనుమతిని ఇవ్వలేదు. క్రోధం చేయకండి కానీ 'లా' ను చేతిలోకి తీసుకోండి అని ఏ మురళిలోనైనా చెప్పారా? 'లా' ను చేతిలోకి తీసుకునేవారి లోపలి రూపము క్రోధము యొక్క అంశముతో కూడినదే ఉంటుంది. నిమిత్త ఆత్మలెవరైతే ఉంటారో, వారు కూడా 'లా' ను చేతిలోకి తీసుకోరు, కానీ వారు 'లా' ను రివైజ్ చేయించాల్సి ఉంటుంది. 'లా' ను ఎవ్వరూ చేతిలోకి తీసుకోకూడదు కానీ నిమిత్తమైనవారు బాబా ద్వారా తయారుచేయబడిన 'లా' ను రివైజ్ చేయాల్సి ఉంటుంది. నిమిత్తమైనవారికే ఈ అనుమతి ఉంది, అందరికీ లేదు.

ఈ రోజు బాప్ దాదా కొంచెం గంభీరంగా శిక్షణనిస్తున్నారు, ప్రేమతో స్వీకరించండి ఎందుకంటే బాప్ దాదా పిల్లలు వ్రాసిన, చేసిన ప్రతిజ్ఞలను చూసి, విని నవ్వుకుంటూ ఉంటారు. ప్రతి గుణాన్ని నిజ సంస్కారంగా చేసుకోండి అని బాప్ దాదా ఇప్పుడు ఏదైతే వినిపించారో దానిని అండర్ లైన్ చేసారా? మరి ఇప్పటినుండి - శాంత స్వరూపములో ఉండటము, సహనశీలురుగా అవ్వటము అనేది నా నిజ సంస్కారముగా అయిపోయింది అని అనాలి. మళ్ళీ బాప్ దాదా మిలనాన్ని జరుపుకోవటానికి వచ్చే సమయానికి ఈ 5-6 నెలలలో వీటిని మీ నిజ సంస్కారంగా తయారుచేసుకుని చూపించండి. అందుకే ఈ రోజు రిజల్టు వినిపిస్తున్నాము. క్రోధము యొక్క రిపోర్టులు చాలా వస్తాయి. చిన్నవారు, పెద్దవారు అందరూ రకరకాల రూపాలలో క్రోధం చేస్తారు. ఇప్పుడు బాప్ దాదా ఎక్కువ వివరంగా తెలియజేయరు, కానీ కథలు చాలా సరదాగా ఉంటాయి. మరి ఈ రోజు నుండి క్రోధాన్ని ఏం చేస్తారు? వీడ్కోలు ఇస్తారా? (అందరూ చప్పట్లు కొట్టారు). చూడండి, చప్పట్లు కొట్టడం చాలా సహజము కానీ క్రోధమనే చప్పట్లు మోగకూడదు. బాప్ దాదా ఇప్పుడిక దీనిని పదే-పదే వినాలని అనుకోవటం లేదు, అయినా కూడా దయ కలుగుతుంది కావున వింటారు. కాబట్టి ఇప్పటినుండి ఇలా అనకండి - బాబా, ప్రతిజ్ఞనైతే చేసాము కానీ... మళ్ళీ-మళ్ళీ వచ్చేసింది, ఏం చెయ్యాలి! కోరుకోము, కానీ వచ్చేస్తుంది, మీరే మాయకు అర్థం చేయించండి, క్రోధానికి అర్థం చేయించండి. ఈ పురుషార్థాన్ని కూడా బాబానే చెయ్యాలా కానీ ప్రారబ్ధాన్ని పిల్లలు తీసుకుంటారా? ఈ శ్రమను కూడా బాబానే చెయ్యాలా? ఇటువంటి ప్రతిజ్ఞను చెయ్యవద్దు, మళ్ళీ 5 నెలల తర్వాత రిజల్టును చూస్తాము. మీరు చెప్పినా, చెప్పకపోయినా కానీ బాబా వద్దకైతే చేరుకుంటుంది. ఏం చెయ్యాలి, అలా అయిపోతుంది, పరిస్థితులు అలా వస్తాయి, విషయం చాలా పెద్దదైపోయింది కదా - అని ఇటువంటి రిజల్టు ఉండకూడదు. బాబాకు కూడా అర్థం చేయించడానికి ప్రయత్నిస్తారు, చాలా తెలివైనవారు. ఏమంటారంటే - బాబా, చిన్న-చిన్న విషయాలను మేము దాటేస్తాము, కానీ ఈ విషయమే పెద్దది కదా! ఇప్పుడు దోషాన్ని ఎవరిపై మోపారు? విషయముపై. విషయము ఏం చేస్తుంది? వస్తుంది-పోతుంది. 5000 సంవత్సరాల తర్వాత మళ్ళీ విషయము వస్తుంది. ఏ విషయమైతే 5000 సంవత్సరాల తర్వాత వచ్చేది ఉందో, దానిపై దోషం మోపుతారు. అలా చెయ్యకండి. ఏం చెయ్యాలి...! అనేది సంకల్పములో కూడా రానివ్వకండి. బాప్ దాదా క్రోధం గురించి ఎందుకు ఇంత విశేషంగా చెప్తున్నారు? ఎందుకంటే ఒకవేళ మీరు క్రోధానికి వీడ్కోలు ఇచ్చారంటే, ఇందులో లోభము, కోరిక అన్నీ వచ్చేస్తాయి. లోభమనేది కేవలము ధనం, తినటం విషయములోనే ఉండదు, అది రకరకాలుగా ఉంటుంది. జ్ఞానానికి సంబంధించైనా, అజ్ఞానానికి సంబంధించైనా, ఏ కోరిక ఉన్నా, అది కూడా లోభమే. క్రోధాన్ని సమాప్తం చెయ్యటం ద్వారా

లోభం స్వతహాగానే సమాప్తం అయిపోతుంది, అహంకారం కూడా సమాప్తం అయిపోతుంది. అభిమానము వస్తుంది కదా - నేను పెద్దవాడిని, నేను తెలివైనవాడిని, నాకు తెలుసు, వీళ్ళు అసలు వీళ్ళ గురించి ఏమనుకుంటున్నారు? అప్పుడు క్రోధము వస్తుంది. కనుక అభిమానము మరియు లోభము, ఈ రెండూ కూడా వీడ్కోలు తీసుకుంటాయి, అందుకే బాప్ దాదా విశేషంగా లోభము గురించి చెప్పకుండా క్రోధం గురించి అండర్ లైన్ చేయిస్తున్నారు. మరి సంస్కారముగా చేసుకుంటారా? ఇప్పుడు అందరూ చేతులెత్తండి మరియు అందరి ఫోటోను తియ్యండి (అందరూ చేతులెత్తారు). ఇప్పుడు కొద్దిగా అభినందిస్తారు, ఎక్కువ అభినందించరు, తర్వాత మళ్ళీ రిజల్టు చూసినప్పుడు వతనములోని దేవతలు కూడా, స్వర్గములోని దేవతలు కూడా మీపై వాహ్, వాహ్ అనే పూలను వేస్తారు.

ఈ రోజు నుండి ప్రతి ఒక్కరూ స్వయాన్ని చూసుకోండి, ఇతరులను చూడకండి. ఇతరులలో ఈ విషయాలను చూసే మనసు యొక్క నేత్రాన్ని మూసెయ్యండి. ఈ నేత్రాలనైతే మూయలేరు కదా, కానీ మనసు యొక్క నేత్రాన్ని మూసెయ్యండి. రెండోవారు చేస్తున్నారా, మూడోవారు చేస్తున్నారా, నేను అది చూడను. బాబా ఇంకెంత ఫోర్స్ పెట్టి చెప్తున్నారంటే ఒకవేళ అరుదుగా ఎవరైనా మహారథి ఇటువంటి బలహీనతను చూపించినా కూడా, దానిని చూసేందుకు మరియు వినేందుకు మనసును అంతర్ముఖిగా చేసుకోండి. ఒక నవ్వొచ్చే విషయం చెప్పాలా, బాప్ దాదా ఈ రోజు కాస్త స్పష్టంగా వినిపిస్తున్నారు, తప్పుగా అనుకోవడం లేదు కదా. అచ్ఛా, ఇంకొక విషయాన్ని కూడా స్పష్టంగా వినిపిస్తాము. బాప్ దాదా చూసారు - మెజారిటీ ఎప్పటికప్పుడు, సదా కాదు కానీ అప్పుడప్పుడు మహారథులలోని విశేషతలను తక్కువగా చూస్తారు మరియు బలహీనతలను చాలా లోతుగా చూస్తారు మరియు ఫాలో చేస్తారు. ఒకరికొకరు చెప్పుకుంటారు కూడా - ఏంటిది, అందరినీ చూసేసాము, మహారథులు కూడా చేస్తారు, మేమైతే తర్వాత వచ్చినవారము, ఇప్పుడు మహారథులు మారితే మేము మారుతాము. కానీ మహారథుల తపస్య, మహారథులు బహుకాలపు పురుషార్థము వారికి అదనంగా మార్కులను ఇప్పించి పాస్ విత్ ఆనర్ గా చేసేస్తాయి. కానీ మీరేమో - మహారథులు మారితే మేము మారుతాము అని ఈ ఎదురుచూడటంలోనే ఉండిపోతారు కావున మోసపోతారు, అందుకే మనసును అంతర్ముఖిగా చేసుకోండి. అర్థమైందా. బాప్ దాదా ఈ మాటలను కూడా చాలా వింటూ ఉంటారు - చూసాములే... చూసాములే, మాకు కూడా కళ్ళున్నాయి కదా, మాకు కూడా చెవులున్నాయి కదా, మేము కూడా చాలానే వింటాము అని అంటారు. కానీ ఈ విషయంలో మహారథులతో పోటీ పడవద్దు. మంచిలో పోటీ పడండి, చెడులో పోటీ పడవద్దు లేదంటే మోసపోతారు. బాబాకు దయ కలుగుతుంది ఎందుకంటే మహారథుల విషయంలో నిశ్చయమనే పునాది ఎడతెగనిది, అచంచలమైనది, కనుక ఆ విషయంలో మహారథులకు అదనపు ఆశీర్వాదాలు లభిస్తాయి, అందుకే ఎప్పుడూ కూడా మనసు యొక్క నేత్రాన్ని ఈ విషయంలో తెరవద్దు, మూసెయ్యండి. వినేందుకు బదులుగా మనసును అంతర్ముఖీగా ఉంచుకోండి. అర్థమైందా!

నలువైపులా ఉన్న బాప్ దాదా యొక్క సర్వ లవలీన ఆత్మలకు, బాబా యొక్క సర్వ సేవాధారీ ఆత్మలకు, సహజ పురుషార్థాన్ని అలవరచుకునే సర్వ శ్రేష్ఠ ఆత్మలకు, సదా బాబా సమానంగా అవ్వాలనే లక్ష్యాన్ని మరియు లక్షణాలను సమానంగా తయారుచేసుకునేవారికి, బాబాకు సమీప ఆత్మలకు బాప్ దాదా యొక్క చాలా-చాలా ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- అందరికీ అమర జ్ఞానాన్ని ఇచ్చి అకాల మృత్యు భయము నుండి విడిపించే శక్తిశాలి సేవాధారీ భవ

ప్రపంచములో ఈ రోజుల్లో అకాల మృత్యువు గురించిన భయమే ఉంది. భయముతోనే తింటున్నారు, నడుస్తున్నారు, నిద్రిస్తున్నారు కూడా. ఇటువంటి ఆత్మలకు సంతోషకరమైన కబురును వినిపించి భయము నుండి విడిపించండి. మేము మిమ్మల్ని 21 జన్మల కొరకు అకాల మృత్యువు నుండి రక్షించగలము అన్న సంతోషకరమైన కబురును వారికి వినిపించండి. ప్రతి ఆత్మకు అమర జ్ఞానాన్ని ఇచ్చి అమరులుగా తయారుచేయండి, తద్వారా వారు జన్మజన్మల కొరకు అకాల మృత్యువు నుండి రక్షింపబడతారు. అలా మీ శాంతి, సుఖము యొక్క వైబ్రేషన్ల ద్వారా మనుష్యులకు సుఖ-శాంతుల అనుభూతిని చేయించే శక్తిశాలి సేవాధారులుగా అవ్వండి.

స్లోగన్:- స్మృతి మరియు సేవ యొక్క బ్యాలెన్సును ఉంచటము ద్వారానే సర్వుల ఆశీర్వాదాలు లభిస్తాయి.